# త్యాగమే జీవిత పరమార్థం

మంచితనమునందు, మానవత్వమునందు
నీతియందు, నిండు నిజమునందు
ఆచరించి చూపునతడె సాధకుడు
ఉన్నమాట తెలుపుచున్నమాట!

ప్రేమ స్వరూపులారా! అద్దములు కంటికి అడ్డముగా ఉంటాయి. కాని దృష్టికి సహాయం చేస్తాయి. అదేరీతిగా సాధకులకు అడ్డు తగిలే కష్టనష్టములు సాధనకు సహాయమే చేస్తాయి గాని, ఏ మాత్రమూ హాని కలిగించవు. ఇట్టి విశ్వాసమును సాధకులు దృఢంగా పెంచుకోవాలి.

ఎట్టి మంటయో అట్టి పొగ, ఎట్టి పొగయో అట్టి మేఘము. ఎట్టి మేఘమో అట్టి వర్షము. ఎట్టి వర్షమో అట్టి పంట. ఎట్టి పంటయో అట్టి వంట. అదేరీతిగా మన భావములు ఎలాంటివో మనం ఆచరించే కర్మలుకూడ అలాంటివిగానే ఉంటాయి. మన కర్మలు ఎలాంటివో అలాంటి ఫలితమునే పొందుతాము. ఒక రాయిని బావిలో విసిరినప్పుడు ఆ రాయి పడినచోట అలలు ప్రారంభమై అవి బావి అంతటా ప్రాకిపోతాయి. అదేవిధంగా మీ మానససరోవరంలో సంకల్పమనే 'రాయి' ని విసిరినప్పుడు దాని నుండి ప్రారంభమయ్యే 'అలలు' దేహంలో నఖశిఖపర్యంతము వ్యాపించిపోతాయి. ఆ సంకల్పము ఎలాంటిదో కన్నులు అలాంటి దృశ్యములనే చూస్తాయి; చెవులు అలాంటి శబ్దమునే వింటాయి; హస్తములు అలాంటి కర్మలనే ఆచరిస్తాయి; పాదములు అలాంటి ప్రదేశములకే నడుస్తాయి. హృదయంలో పవిత్రమైన భావములు ప్రవేశించినపుడు సర్వాంగములూ పవిత్రమైన కర్మలనే ఆచరిస్తాయి. పవిత్రమైన భావములవల్లనే మానవత్వానికి సార్థకత చేకూరుతుంది. కనుక, మానవుడు తనకు ఏ ఆలోచన కల్గినప్పటికీ మొట్టమొదట "ఇది మంచిదా, చెడ్డదా? ఇది తప్పా, ఒప్పా?" అని విచారణ చేయాలి. నిజంగా మానవుని మనస్సు మధురమైనది, హృదయం మృదువైనది, కాలము పవిత్రమైనది. కనుక మానవుని సంకల్పములు, మాటలు, చేతలుకూడా మృదువైనవిగా, మధురమైనవిగా ఉండాలి.

sri sathyasaivachanamrutam

## హృదయమొక ట్యాంకు, ఇంద్రియాలు ట్యాప్పు

భగవంతుడు మానవజీవితమును ప్రసాదించినది ఏదో ఒక ఆదర్శమును అందించే నిమిత్తమేగాని, వ్యర్థంగా కాలమును గడపటానికి కాదు. కాని మానవుడు తనయందు పవిత్రమైన భావములు లోపించటంచేత అపవిత్రమైన కర్మలలో ప్రవేశిస్తున్నాడు. మానవ హృదయం ఒక 'ట్యాంకు' తో పోల్చవచ్చును. ట్యాంకులో పవిత్రతను నింపుకున్నప్పుడు ట్యాప్స్‌లో అపవిత్రత రావటానికి వీల్లేదు. కనుక, హృదయాన్ని ప్రేమతో నింపుకున్నప్పుడు చేతులు పవిత్రమైన పనులే చేస్తాయి; కన్నులు పవిత్రమైన దృశ్యాలనే చూస్తాయి. మానవ జీవితం దివ్యమైనది, భవ్యమైనది, జీవించతగినది. ఇలాంటి జీవితాన్ని ఎంతవరకు సద్వినియోగం గావించుకుంటున్నారో ఎవరికి వారు యోచించుకోవాలి.

## నరుడు బుద్బుదంబు, నారాయణుడు నీరు

హృదయంలో చెడ్డభావములు ఆవిర్భవించటానికి అవకాశం లేదు. ఎందుకంటే హృదయం భగవంతునియొక్క నివాసం. కనుకనే భగవంతుణ్ణి 'హృదయవాసి' అన్నారు. శ్రీకృష్ణుడు ''మమైవాంశో జీవలోకే జీవభూతః సనాతనః'' అన్నాడు. అందరూ భగవంతునియొక్క అంశములే.

> నీటియందె పుట్టి నీటియందె పెరిగి
> నీటియందడంగు నీటి బుడగ
> నరుడు బుద్బుదంబు, నారాయణుడు నీరు
> ఉన్నమాట తెలుపుచున్న మాట!

నరుడు నీటిబుడగ, నారాయణుడు నీరు. నీటినుండి ఆవిర్భవించినవే నీటిబుడగలు. అదేరీతిగా దైవమునుండి ఆవిర్భవించినవాడు మానవుడు. కనుక తాను దైవభావములనే నింపుకోవాలి. అయితే మానవునికి వచ్చే చెడ్డభావములన్నీ ఎక్కడినుండి వస్తున్నాయని మీరు ప్రశ్నించవచ్చు. ఈ చెడ్డభావములన్నీ భౌతికమైన, లౌకికమైన, ప్రాకృతమైన జీవితంలో కలిగే అనుభూతులవల్లనే ఏర్పడుతున్నాయి.

## దేశమే మీ దేహమని భావించండి

మన శ్రీనివాసన్ (అఖిల భారత శ్రీ సత్యసాయి సంస్థల అధ్యక్షుడు) చెప్పాడు – ఈ

కాన్ఫరెన్సులో 148 దేశములనుండి వచ్చిన డెలిగేట్లు పాల్గొన్నారని. దేశములు వేరు, భూమి ఒక్కటే; శృంగారములు వేరు, బంగారమొక్కటే; జీవజాతులు వేరు, జీవుడు ఒక్కడే. ఇట్టి ఏకత్వాన్ని గుర్తించినప్పుడే మీలో దివ్యత్వం ఆవిర్భవిస్తుంది. మొట్టమొదట దైవం ఒక్కడే అనే సత్యాన్ని గుర్తించండి. అల్లా అని పిలువవచ్చు, జీసస్ అని పిలువవచ్చు, జోరాస్టర్ అని పిలువవచ్చు. హిందువులు దైవానికి అనేకపేర్లు పెట్టుకున్నారు. ఎన్ని పేర్లతో పిలిచినా దైవం ఒక్కడే అనే ధృఢవిశ్వాసమును పెంచుకోవాలి. ఇతర మతములను మీరు ఏమాత్రమూ విమర్శించకూడదు. ఎవరి సాధన వారిది, ఎవరి ఆనందము వారిది. మొట్టమొదట మీ యందున్న దుర్గుణాలను త్యాగం చేయండి. వేదం చెప్పినది కూడా ఇదే – " నకర్మణా నప్రజయా ధనేన త్యాగేనైకే అమృతత్వ మానశుః". కాని, ఈనాటి మానవునిలో కోరికలు పెరుగుతున్నాయి; త్యాగభావము ఎంతమాత్రమూ కలగటంలేదు. దేశాభిమానమును విస్మరించి, దేహాభిమానమును పెంచుకుంటున్నారు. ఏకత్వాన్ని విస్మరించి, భిన్నత్వాన్ని అనుభవిస్తున్నారు. ఏది మీ దేహము? దేశమే మీ దేహము. ఇట్టి విశాలమైన భావాన్ని పెంచుకోవాలి.

**చేసిన త్యాగం సద్వినియోగం కావాలి**

సంపాదించిన ధనమును త్యాగం చేయాలి. దైవసంబంధమైన విషయంలో చేసిన త్యాగమే నిజమైన త్యాగం. చేసిన త్యాగం సద్వినియోగం కావాలి గాని, దుర్వినియోగం కాకూడదు. ఒక వ్యక్తి ఎంతో త్యాగం చేసి ఇక్కడ ఇంతటి విశాలమైన హాలును నిర్మించాడు. అతను చేసిన త్యాగం వల్లనే ఈనాడు ఇంతమంది భక్తులకు, సాధకులకు ఇది ఆశ్రయంగా నిలిచింది. అన్ని దేశములవారూ, అన్ని మతములవారూ, అన్ని భాషలవారూ ఈ హాల్లో ఏకత్వభావనతో సమావేశమవుతున్నారు. లోకంలో ఎంతమందో శ్రీమంతులున్నారు. ఇలాంటి త్యాగం ఎంతమంది చేస్తున్నారు? కొంతమంది సత్రములుకట్టించటం, బావులు త్రవ్వించటం, స్కూళ్ళు నిర్మించటం వంటి సత్కార్యములు చేస్తున్నారుకాని, వారు చేసే త్యాగంలో అంతో ఇంతో స్వార్థప్రయోజనములుంటున్నాయి. స్వార్థ స్వప్రయోజనములతో కూడిన త్యాగం త్యాగమనిపించుకోదు. మీకు తెలుసు – ఇక్కడ సంగీత కళాశాల కట్టించాము. ఇది కూడా ప్రపంచమునకు ఉపయోగపడేదే! భగవంతుడు గానప్రియుడు, గానలోలుడు. అలాంటి గానమును నేర్పించే నిమిత్తం ఇక్కడ సంగీత కళాశాలను నెలకొల్పాము. ఏ దేశంలోనో ఉండే

srisathyasaivachanamrutam

వ్యక్తి వచ్చి ఈ ప్రశాంతినిలయంలో సంగీత కళాశాలను కట్టించాడంటే అతని అదృష్టం ఎంత గొప్పది!

**వద్దురా బాబు హద్దు మీరిన ఆశ!**

మీరు వేరుగా భావించకూడదుగాని, ఎక్కడ మీరు త్యాగం చేసినప్పటికీ అక్కడ అంతో ఇంతో స్వార్థప్రయోజనములుంటాయి. సాయి సంస్థల యందు మాత్రమే స్వార్థం లేదు, స్వప్రయోజనం లేదు. స్వార్థరహితమైనది శ్రీ సత్యసాయి సంస్థ. ఇలాంటి పవిత్రమైన సంస్థలద్వారా మీరు ప్రజలకు ఎంతైనా ఉపకారం చేయవచ్చు. అయితే, మీరు చేయాలని నేను ఆశించటం లేదు. నేను చేయాలనుకుంటే ప్రపంచమునే మార్పు చేయవచ్చు. మీకు ఎందుకోసం చెబుతున్నానంటే మీ జన్మలుకూడ సార్థకం కావాలి, మీ జీవితాలు కూడా పవిత్రం కావాలి. లోకంలో ఎంతమందో శ్రీమంతులున్నారు. కాని అందరికీ ఇలాంటి త్యాగబుద్ధి పుట్టటం లేదు. త్యాగబుద్ధి పుట్టకపోవటం కూడా ఒక దురదృష్టమే!

కోటీశ్వరుండైన కూడుగుడ్డయెగాని
బంగారమును తిని బ్రతుకలేడు
కాలమే గాకున్న కఱ్ఱయే పామగును
కలిసివచ్చిన మట్టి కనకమగును
పండితుడొకచోట పశువుగా మారును
మూర్ఖుండొకతరిని మునిగ మారు
ధనవంతు నొకపరి దారిద్ర్య దేవత
వరియించి ప్రేమతో వరుసలాడు
ప్రాకులాటయెగాని ప్రాప్తియే లేకున్న
దమ్మిడయిన నీకు దరికి రాదు
వద్దురా బాబు హద్దు మీరిన ఆశ
బుద్ధితో మెలగుము సాయివద్ద

ఎంత ధనముండి ఏమి ప్రయోజనం? చచ్చే సమయంలో పిడికెడు మట్టైనా తీసుకువెళ్ళటానికి వీలు కాదు. అనేకమంది తాము సంపాదించిందంతా బ్యాంకులలో కూడపెడుతున్నారు,

sri sathyasai vahini/vachanamrutam

దొంగతనంగా దాచిపెడుతున్నారుగాని, పవిత్రమైన త్యాగానికి ఎవ్వరూ పూనుకోవటం లేదు.

**ఇచ్చుకునేవారికే పుచ్చుకోవటానికి అర్హత ఉంటుంది**

దాచిపెట్టుకున్న ధనం మట్టితో సమానం. ధనం కాదు ముఖ్యం. హృదయ పవిత్రత చాలా ప్రధానమైనది హృదయాన్ని పవిత్రం గావించుకునే నిమిత్తం మీరు త్యాగం చేయాలి. ఏదైనా షాపుకు పోయి ఒక చిన్న హేండ్ కర్చీఫ్ కొనాలన్నా పది రూపాయలు చెల్లించాలి కదా! అదేవిధంగా భగవంతునికి ఏదైనా ఇచ్చుకున్నప్పుడే ప్రేమగాని, అనుగ్రహంగాని, శాంతిగాని ఏదో ఒకటి పుచ్చుకోవటానికి వీలవుతుంది. అయితే భగవంతుడు దేనినీ ఇవ్వమని కోరడు. కాని ఇచ్చుకోవటం మీ డ్యూటీ (కర్తవ్యం). మీరు ఇచ్చుకుంటేనే పుచ్చుకోవటానికి తగిన అర్హత పొందుతారు. సర్వశక్తిమయుడైన, సర్వజ్ఞుడైన, సర్వస్వరూపుడైన భగవంతునికి మీరు ఏ కొంత ఇచ్చినా ఎంతో పుచ్చుకుంటారు. భగవంతునికి మీరు ఏమీ ఇవ్వనక్కర్లేదు; నిర్మలమైన ప్రేమను ఇచ్చుకోండి, చాలు. ధనాశను తగ్గించుకోండి. ఆశలు లౌకికమైన జీవితాన్నే పెంచుతాయి గాని, పారమార్థిక జీవితాన్ని పెంచలేవు.

ఒక రైలు కృష్ణానదిమీదున్న వంతెనపై ప్రయాణిస్తున్నది. ఆ రైలులో ప్రయాణిస్తున్న ఒక భక్తురాలు రెండు కాసులు తీసి "కృష్ణార్పణం" అంటూ నదిలో వేసింది. అదే కంపార్టుమెంటులో ప్రయాణిస్తున్న ఒక ఆధునిక యువకుడు ఆ దృశ్యాన్ని చూసి "ఏమిటి ఈమె అనవసరంగా డబ్బును నదిలో పడవేసి వ్యర్థం చేస్తున్నదే! ఇదెంత వెఱ్ఱితనం!" అన్నాడు. అతని మాటలు విని ఆమె "నాయనా! వెఱ్ఱితనం నాది కాదు, నీదేను. నేను భగవత్ప్రీత్యర్థం రెండు కాసులు నదిలో వేస్తే అది వ్యర్థమని భావిస్తున్నావు. మరి నీవు సిగరెట్లకు, కాఫీలకు, టీలకు, డ్రింకులకు ఎంత ధనం వ్యర్థం చేస్తున్నావో ఆలోచించావా?" అని ప్రశ్నించింది. నీరు మీ దేహాన్ని పవిత్రం గావిస్తుంది. దైవం మీ జీవితాన్నే పవిత్రం గావిస్తాడు. కాని ఆ నమ్మకం మీలో లేకపోవటం చేత మీరు దైవానికి అర్పితం కావటం లేదు. "కొనేది వంకాయ, కొసరడిగేది గుమ్మడికాయ" అన్నట్లు, ఈనాటి మానవుడు ఇచ్చేది తక్కువ, కోరేది ఎక్కువ. అధికంగా కోరితే అధికంగా ఇచ్చుకోవాలి.

**త్యాగమే యోగం, అదే నిజమైన భోగం**

బజార్లో కనిపించే బెగ్గర్లకు మీరు డబ్బు దానం చేయకూడదు. ఎందుకంటే ఆ డబ్బుతో

వారు డ్రింకు త్రాగి దుర్వినియోగం చేయవచ్చు. కాబట్టి మొట్టమొదట వారికి ఏమి కావాలో అడిగి తెలుసుకోవాలి. గుడ్డలు అవసరమంటే గుడ్డలు ఇవ్వాలి; ఆకలౌతోందంటే అన్నం పెట్టాలి. వారికి ఏది అవసరమో అది ఇవ్వాలి. అవసరానికి మించి దానం చేస్తే అది దుర్వినియోగం అవుతుంది. "అతి సర్వత్ర వర్జయేత్". మనకు గాలి ఎంత అవసరమో అంతే పీల్చుకోవాలి. ఎక్కువగా పీల్చుకుంటే ఉక్కిరిబిక్కిరి అవుతాము. టంబ్లరు నీరు త్రాగితే మన దాహం తీరుతుంది. గంగానది అంతా కావాలంటే సాధ్యమౌతుందా? కాబట్టి దురాశ మంచిది కాదు. దేనినీ వ్యర్థం చేయకూడదు. అవసరమైనంత తీసుకోవాలి. పీల్చుకున్న గాలిని వదలకపోతే ఊపిరితిత్తులు పాడైపోతాయి. భుజించిన ఆహారమును మరొక వైపున విసర్జించకపోతే కడుపు చెడిపోతుంది. అదే రీతిగా సంపాదించిన ధనమునుకూడా త్యాగం చేయాలి. త్యాగంలో ఎంతో ఆనందమున్నది. ధనమును త్యాగం చేయటానికే సంపాదించాలిగాని, కూడబెట్టుకోవటానికి కాదు. ధనమును కూడబెట్టుకునేవారికి నేడు కాకపోతే రేపైనా ఏదో ఒక ప్రమాదం జరుగుతుంది. త్యాగమే యోగము. అదే నిజమైన భోగము. కనుక సత్యసాయి సంస్థలవారందరూ శక్తి కొలది త్యాగం చేయాలి. బాధలలో ఉన్నవారిని ఆదుకోండి. ఇల్లు వాకిలి లేక బాధపడుతున్నవారికి చిన్న గూడు కట్టించండి; తినటానికి తిండిలేనివారికి ఉద్యోగం ఇప్పించండి. ఒకానొక సమయంలో జీసస్, పీటర్ ఇరువురూ పడవలో ప్రయాణమై వెళుతున్నారు. ఆ పడవ గట్టు చేరగానే ఒక వ్యక్తి వచ్చి తనకు ఆకలౌతోందని అన్నాడు. వెంటనే పీటర్ అతనికి రెండు చేపలను తీసి ఇచ్చాడు. అప్పుడు జీసస్ చెప్పాడు "పీటర్! నీవు ప్రతి దినమూ అతనికి చేపలనిచ్చి ఆకలి తీర్చలేవు. కాబట్టి ఒక వలను కొని ఇవ్వు. దానితో అతడు చేపలను పట్టి ఆకలి తీర్చుకుంటాడు." అదేరీతిగా మీరు కూడా తినటానికి తిండి లేక బాధపడేవారికి చిన్న ఉద్యోగం ఇప్పించి వారి ఆకలి తీర్చాలి. అయితే ఈ కలిప్రభావంచేత అందరూ కష్టపడకుండా ధనం సంపాదించాలని ఆశిస్తున్నారు.

### తృప్తియే శాంతి, అసంతృప్తియే అశాంతి

ప్రశాంతినిలయంలో జరిగిన ఒక యథార్థ సంఘటనను గూర్చి చెబుతున్నాను. పూర్వం వికలాంగులకొరకు ఒక ఆశ్రమం కట్టించాను. వారికి ప్రతి దినమూ ఉదయం కాఫీ, టిఫిన్లతోపాటు మధ్యాహ్నం, రాత్రి రెండు పూటల భోజనం అందిస్తూ వచ్చాము. కొంతమంది



sri sathyasai vacharamrutam

స్త్రీలు తాంబూలం కావాలన్నారు. అది కూడా ఇచ్చాము. కాని బజార్లోకి వెళ్ళి అడుక్కుంటే కాసులు చిక్కుతాయనే దురాశ వారిలో బయలుదేరింది. ఈనాడు అందరికీ కాసులపై ఆశ మితిమీరి పోయింది. ధనము వస్తుంది, పోతుంది. నైతిక శక్తి వస్తే అభివృద్ధి చెందుతుంది. ఇవన్నీ మన సంస్థలవారికి తెలిసినవే. కాని, తెలిసి మీరు ఎందుకు డబ్బుకోసం ప్రాకులాడుతున్నారు? ప్రాకులాడకూడదు. ఉన్నదానితో తృప్తి పొందండి. దేశంలో అనేకమంది బీదలుంటున్నారు. అయితే నిజంగా బీదలే గొప్ప షాహుకారులని చెప్పవచ్చు. ఎందుకంటే వారికున్న తృప్తి షాహుకారులకుకూడ ఉండదు. తృప్తియే శాంతి; అసంతృప్తియే అశాంతి. ఆశలు పెరిగేకొలది అశాంతియే తప్ప శాంతి అనేది లభించదు. కనుక,కోరికలను తగ్గించుకోండి. ఉన్న ధనాన్ని సద్వినియోగం చేసుకోండి. మీ కుమారులను, మనుమలను, మనుమరాళ్ళను అమెరికాకు పంపించాలని ధనమును కూడపెడుతున్నారా? వారు పెద్దవారైన తరువాత అమెరికాయే పోతారో, ఇంకో లోకానికే పోతారో ఎవరికి తెలుసు? వారు వెళ్లవలసి ఉంటే ఆ సమయానికి డబ్బు అదే వస్తుంది.

అనేకమంది వచ్చి "స్వామీ! మాకు Peace of mind (మనశ్శాంతి) లేదు" అంటారు. భగవంతుడు మీకు కావలసినంత శాంతిని అందించాడు. ప్రపంచమంతా శాంతితో నిండియుంది. మీరే శాంతిస్వరూపులు, కాని మీరు దుర్మార్గమైన పనులలో ప్రవేశించటంచేత మీకు Peace (శాంతి) లేకుండా పోతున్నది. మీకు ఆశలు అధికం కావటంచేత, మీ ఇంద్రియాలను దుర్వినియోగపరచటం చేత మీ శాంతి Pieces (ముక్కలు) అయిపోతున్నది. ఈనాటి మానవుడు దుర్వాంఛలచేత క్రమక్రమేణ పశువుగా మారిపోతున్నాడు. మానవత్వంలో దివ్యత్వాన్ని పెంచుకోవాలిగాని, పశుత్వాన్ని పెంచుకోకూడదు.

**ఆడంబరాలకోసం ధనం దుర్వినియోగం చేయకండి**

మానవునికి అవసరమైన ప్రతి పదార్థమునూ భగవంతుడు స్వయంగా అందించాడు. ఎక్కడ చూసినా మంచియే ఉన్నది. కాని ఆ మంచిని మీరు గమనించటం లేదు. చెడ్డచేతనే మీరు ఆకర్షింపబడుతున్నారు; చెడ్డనే విశ్వసిస్తున్నారు. మీరందరూ చూస్తూనే ఉన్నారు – ఇక్కడ ఇన్ని లక్షలమంది వచ్చినప్పటికీ అందరికీ ఉచిత భోజనం అందించబడింది. అది ఎంత మధురంగా ఉన్నది! మికు ఏది పెడుతున్నానో నేనుకూడా అదే భుజిస్తున్నాను. మంచి

sri sathyasai vachanamrutam

'టేస్టు' కలిగియున్నది. పవిత్రంగా ఉన్నది. వంటవారుకూడా ఎంతో ఉత్సాహంగా చేస్తున్నారు. కాని కొంతమంది ఇలాంటి పవిత్రమైన వంటను ఇష్టపడక, బయటి హోటళ్ళకు వెళ్ళి అక్కడ ఒక రూపాయికి వేయి రూపాయల బిల్లు వేసినా సిగ్గు లేకుండా ఇస్తున్నారు. ఎందుకీవిధంగా మీరు డబ్బును దుర్వినియోగం చేయటం? ఇలాంటి అహంకార, ఆడంబరములను మీరు నిర్మూలం చేసుకోవాలి. మరొక చిన్న విషయము. మీకు ఢిల్లీలోనో, బొంబాయిలోనో ఏదైనా అర్జంటు పని ఉంటే, మీరు విమానంలో ప్రయాణమై వెళ్ళవచ్చును. కాని, ఏ పనీపాటా లేకుండా స్వేచ్ఛగా ఉండేవారు కూడా అంత డబ్బు ఖర్చు పెట్టి విమానంలో ప్రయాణించడమెందుకు? రైలులో ప్రయాణిస్తే ఖర్చు తక్కువవుతుంది కదా? అయితే ట్రైనులో ప్రయాణం కంటే ప్లేనులో ప్రయాణం క్షేమం అంటారేమో! ప్లేనుకి మాత్రం ప్రమాదాలు సంభవించవా? కాలమే తీరినప్పుడు ఏదైనా జరుగుతుంది.

**ఆహారాన్ని, కాలాన్ని , శక్తిని వ్యర్థం చేయకండి**

Food is God. Don't waste food. కొంతమంది తట్టనిండా అన్నం పెట్టించుకుని చివరికి చాలాభాగం వదలిపెట్టిపోతుంటారు. "అన్నం బ్రహ్మ" అన్నారు. బ్రహ్మస్వరూపమైన అన్నమును వ్యర్థం చేసి బ్రహ్మను పూజిస్తే ఏమి లాభం? ఎంత అవసరమో అంత పెట్టుకోవాలి, తృప్తిగా భుజించాలి. అంతేకాని ఆహారాన్ని వ్యర్థం చేయకూడదు. Time is God. Don't waste time.కాలం భగవత్స్వరూపం.కనుకనే భగవంతుణ్ణి"కాలాయనమః కాలకాలాయనమః .."అని వర్ణిస్తున్నారు. కాలమువల్లనే ఈజగత్తు ఉద్భవిస్తున్నది; కాలమువల్లనే ఎన్నో కార్యములు జరుగుతున్నాయి. కాలమును వ్యర్థం చేస్తే జీవితాన్ని వ్యర్థం చేసినట్లే!

అదేరీతిగా Don't waste energy (శక్తిని వృథాచేయకండి) చెడ్డమాటలచేత, చెడ్డ విషయాలను శ్రవణం చేయటం చేత, పిచ్చి పిచ్చి కథలను చదవటంచేత, పిచ్చి పిచ్చి బొమ్మలను, సినిమాలను, టీవీలను చూడటంచేత మీ శక్తి ఎంతగానో వ్యర్థమైపోతున్నది. మంచివి ఏవైనా ఉంటే చూడండి. తప్పులేదు. ఎంత అవసరమో అంత మాట్లాడండి. ఊరికే మాట్లాడేవాడు తెలివి తక్కువవాడే! చాలామంది సమావేశాలలో కూర్చుని తమ ప్రక్కన కూర్చున్నవారితో ఊరికే మాట్లాడుతుంటారు. భగవంతుణ్ణి "శబ్దబ్రహ్మమయి" అన్నారు. కనుక అనవసరమైన మాటలతో శబ్దమును అపవిత్రం గావించకూడదు. మాటలను అదుపులో పెట్టుకోవటంచేత

sri sathyasai vahini amrutam

మీరెంతో బాగుపడతారు. అంతేకాదు చూపునుకూడా అదుపులో పెట్టుకోవాలి. పిచ్చి పిచ్చి బొమ్మలు, పిచ్చి పిచ్చి దృశ్యాలను చూడటమెందుకు? వాటిని చూడటం వల్ల కలిగే ప్రయోజనమేమిటి? ఇంతకాలం ఎన్నో చూశారు. వాటివల్ల కల్గిన లాభమేమిటి? ఇక చూడబోయే వాటివల్ల కలిగే ఉపయోగమేమిటి. ఏమీ లేదు. కనుక చెడ్డ దృశ్యాలను చూడకండి.

**దేవుని రూపాన్ని కన్నులారా చూడండి**

అనేకమంది దేవాలయాలకు వెళుతున్నారు. కాని, వెళ్ళిన తరువాత దేవుణ్ణి చూడటం లేదు; కన్నులు మూసుకుని నమస్కారం చేస్తున్నారు. అంతదూరం వెళ్ళింది దేనికోసం? దేవుణ్ణి చూడాలనే కదా? మరి అక్కడికి వెళ్ళిన తరువాత కన్నులు మూసుకోవటమెందుకు? కన్నులు తెరచుకొని చక్కగా చూడండి. నేను భజనలో కూర్చున్నప్పుడు చూస్తుంటాను – భజన చేసే పిల్లలు కూడా కన్నులు మూసుకుని పాడుతుంటారు. సూరదాసువలె మీరు గ్రుడ్డివారు కాదే! మరి కన్నులు తెరిచి చక్కగా చూడవచ్చు కదా! కన్నులతో చూడాలి, చేతితో తాళం వేయాలి, నోటితో నామమును ఉచ్చరించాలి. ఏ దేవాలయమునకు వెళ్ళినా ఆ దేవుని రూపాన్ని కన్నులారా చూడాలి; ఆ రూపాన్ని హృదయంలో ప్రతిష్ఠ చేసుకోవాలి. అప్పుడే మీలో భక్తి ప్రపత్తులు అభివృద్ధి అవుతాయి. ఈనాడు మీలో భక్తి ప్రపత్తులు తరిగిపోవటానికి కారణం మీరు సత్యాన్ని గుర్తించుకోలేకపోవటమే. మీరు సత్యాన్ని గుర్తించాలనే నేనీనాడు మీకు చిన్న చిన్న విషయాలు కూడా చెబుతున్నాను. సత్యాన్ని తెల్పటం నా కర్తవ్యం.

**నాజీవితమే నా సందేశం, నన్ను అనుసరించండి**

మీరు భక్తిప్రపత్తులను అభివృద్ధిపరచుకొని పవిత్రమైన జీవితాన్ని గడపాలని ఆశిస్తే, పవిత్రమైన కర్మలను ఆచరించండి. అప్పుడు తప్పక మీరు దివ్యత్వాన్ని పొందగలరు. దీనిని పురస్కరించుకొనియే నేను My life is My message (నా జీవితమే నా సందేశం) అన్నాను. Follow Me (నన్ను అనుసరించండి). నేను అందరినీ ప్రేమిస్తాను. ప్రేమలో ఎంతో పవిత్రత ఉన్నది. ప్రేమయే క్రమక్రమేణ జ్ఞానస్వరూపాన్ని పొందుతుంది. పవిత్రమైన ప్రేమచేతనే నేను ఇంతకాలము ఇంతమంది ప్రజలకు దివ్యత్వాన్ని బోధించుటకు వీలైంది.

మీకందరికీ నేనేమైనా ఇన్విటేషన్లు (ఆహ్వాన పత్రికలు) పంపించానా! లేదే! నా ప్రేమయే మిమ్మల్ని ఇక్కడికి రప్పించింది. మీరు ఈ సత్యాన్ని గుర్తించండి – మీరందరూ ఇక్కడికి

sri sathyasai vachanamrutam

ఎందుకోసం వచ్చారు? ఇక్కడున్న ఆనందము మీ ఇంట్లో లేదు, మీ గ్రామంలో లేదు, మీ రాష్ట్రంలో లేదు, మీ దేశంలో లేదు. అక్కడ లేని ఆనందాన్ని ఇక్కడ పొందాలనే మీరే వస్తున్నారు. అట్టి ఆనందమును ఇచ్చే దివ్యత్వాన్ని మీ హృదయంలో భద్రంగా ప్రతిష్ఠ చేసుకోవాలి. "ముండే ముండే మతిర్భిన్నః" ఒక్కొక్కరి భావములు ఒక్కొక్క రకంగా ఉంటాయి. ఒకరు మంచిగా భావించవచ్చు. ఒకరు చెడ్డగా భావించవచ్చు. మంచిచెడ్డలు మీ మనస్సుయొక్క ప్రభావమేగాని, సాయికి వాటితో సంబంధము లేదు. నాది ప్రేమతత్త్వము ఒక్కటే.

నేను ప్రేమను మాత్రం చూస్తాను తప్ప ప్రవర్తనను, భావాలను ఏమాత్రమూ విచారించను. మీ దృష్టి ఎలాంటిదో మీకు అలాంటి భావాలే కలుగుతుంటాయి. నాకు వాటితో సంబంధము లేదు. నా తత్త్వం ఎప్పుడూ ప్రేమయే. మీరు తిన్నదే మీకు త్రేపు వస్తుందిగాని, నేను తిన్నది మీకు రాదు కదా! కాబట్టి మీకు చెడ్డ భావాలు వస్తున్నాయంటే ఆ దోషం మీదేగాని, నాది కాదు. నాలో ఎలాంటి చెడ్డ తలంపులూ లేవు. అంతా పవిత్రం, పవిత్రం, పవిత్రం! "హృదయం పవిత్రం, మాటలు పవిత్రం, చేతలు పవిత్రం, సర్వం పవిత్రం."

**మీరందరూ నా ప్రాపర్టీయే !**

ఈ దేహానికి 75 సంవత్సరాలు వచ్చాయి. ఇంతవరకు నేను ఎవ్వరినీ ఏదీ అడగలేదు. కాని ఎన్నో బృహత్కార్యాలు జరుగుతున్నాయి. ఇవన్నీ ఎలా జరుగుతున్నాయి? నేనేమైనా సంపాదిస్తున్నానా? నా ప్రాపర్టీ ఒక్క నయాపైసా లేదు. కాని ఎవ్వరికీ తెలియని ప్రాపర్టీ నావద్ద దండిగా ఉంది. ఏమిటది? మీరందరూ నా ప్రాపర్టీయే! ఇంత ప్రాపర్టీ ఇంకెవరికుంది? ఎవ్వరికీ లేదు. ఇచ్చి పుచ్చుకునే ప్రాపర్టీకి ఒక పరిమితి ఉంటుంది కాని, నా ప్రాపర్టీకి పరిమితి అనేదే లేదు. నాది Unlimited Property. (అపరిమితమైన ఆస్తి). అదే ప్రేమ. ఆ ప్రేమయే ఇంతమందిని ఆకర్షిస్తున్నది. ఇక్కడ సమావేశమైన సాధకులు విన్న విషయాలను మననం చేసుకొని, అన్నీ కాకపోయినా కొన్నైనా ఆచరణలో పెడితే ప్రపంచమంతా బాగుపడుతుంది. "లోకాస్సమస్తాస్సుఖినో భవంతు". మీరు,మీ కుటుంబము మాత్రమే సుఖంగా ఉండాలని కోరుకోకూడదు; అందరూ సుఖంగా ఉండాలని కోరుకోవాలి. మీరు, మీ కుటుంబము మాత్రమే క్షేమంగా ఉంటే, మీరెలా బ్రతుకగలరు? మీరు బ్రతకటానికి ఒక పల్లె అయినా ఉండాలి కదా? ఆ పల్లెవారు సుఖంగాఉండాలి కదా! దీనికి ఒక చిన్న కథ చెప్పి ముగిస్తాను.

## విశాలహృదయులైన రాజదంపతులు

ఒక రాజుగారు, రాణిగారు చాలా మంచివారు; ప్రజలను కన్నబిడ్డలవలె పరిపాలిస్తూ, చాలా అభివృద్ధికి తీసుకువచ్చారు. ఒకనాడు రాణిగారు రాజుగారికి తలంటుతూ, కన్నీరు కార్చింది. ఆ దృశ్యాన్ని ఎదురుగా ఉన్న అద్దంలో చూసి రాజుగారు "రాణీ ఎందుకేడుస్తున్నావు?" అని ప్రశ్నించాడు. ఆమె చెప్పింది – "మీ తలవెంట్రుకలు నెరిసిపోతున్నాయి. ఇది మీకు భగవంతుని మొట్టమొదటి పిలుపు. రెండవ పిలుపు కనుమసకలు రావటం. మూడవ పిలుపు పళ్ళు ఊడిపోవటం, నాల్గవ పిలుపు శరీరం ముడతలు పడటం. మీకు భగవంతుని నుండి మొట్టమొదటి పిలుపు వచ్చేసిందే, అని నాకు దుఃఖం కల్గింది." రాజుగారు మహాజ్ఞాని. "రాణీ! నీవు చెప్పింది సత్యమే. నేనింతవరకు దీనిని గుర్తించనే లేదు. రేపే అరణ్యానికి వెళ్ళి తపస్సు ప్రారంభిస్తాను" అన్నాడు. మరునాడు అరణ్యానికి వెళ్ళి తపస్సు ప్రారంభించాడు. అయితే తనకు చావు రాకూడదని కాదు, దేహమున్నంతలోనే దివ్యత్వాన్ని దర్శించాలని భావించాడు. అతని తపస్సుకు మెచ్చి నారాయణుడు ప్రత్యక్షమై "రాజా! నీకు ఏమి కావాలి?" అని ప్రశ్నించాడు. "స్వామీ! నీ సన్నిధే నాకు పెన్నిధి. నాకు నీ అనుగ్రహం తప్ప ఇంకేమీ అవసరం లేదు. అయితే, నాదొక చిన్న కోరిక. నా దేశంలోని ప్రజలందరూ నిండుగా నూరేళ్ళు జీవించాలి. అందరూ సమానంగా భోగ భాగ్యాలను అనుభవించాలి. బీదలు, ధనికులు అనే భేదం ఉండకూడదు" అని కోరాడు.

అప్పుడు నారాయణుడు "రాజా! నీ కోరిక చాలా ఉత్తమమైనదే! అయితే సృష్టిలో అందరినీ సమానంగా ఉంచటానికి వీలుకాదు. ఈ జగత్తులో ద్వైతము ఉండితీరవలసిందే!" అన్నాడు. కాని తన కోరికను తీర్చుమని రాజు పట్టుపట్టటంతో నారాయణుడు అంగీకరించక తప్పలేదు. రాజు తన రాజ్యానికి తిరిగి వచ్చేటప్పటికి ఎక్కడ చూసినా పెద్దపెద్ద భవనాలు కనిపించాయి. ఎవ్వరూ కాలినడకన ప్రయాణం చేయటం లేదు. అందరూ వాహనాల్లో వెళుతున్నారు. రహదారులన్నీ చెత్తతో నిండిపోయాయి. ఎక్కడా ఊడ్చేవారు కనిపించలేదు. తన భవనమును చేరుకునేసరికి బయట కాపలాదారులుకూడా కనిపించలేదు. తక్షణమే రాణిని పిలిచి "నగరంలో వీథులన్నీ ఎందుకింత మురికిగా ఉన్నాయి? ఊడ్చేవాళ్ళను పిలిపించి శుభ్రం చేయించవచ్చు కదా!" అన్నాడు. అప్పుడామె "మహారాజా! గత కొద్ది రోజులుగా ఊడ్చేవాళ్ళు రావటం లేదు.

sri sathyasai vahini amrutam

చాకలిగాని, మంగలిగాని వారివారి విధులకు హాజరు కావటం లేదు. వంటవారుకూడా రావటం లేదు. భగవంతుణ్ణి మీరు ఏమని కోరారు?" అని ప్రశ్నించింది. "నా రాజ్యంలో ప్రజలు నూరేళ్ళు జీవించాలని, అందరూ సమానంగా ఉండాలని కోరాను" అన్నాడు రాజుగారు. అయితే తన కోరిక సరియైనది కాదని తెలుసుకున్నాడు. భగవంతుని సృష్టిలో మంచి చెడ్డలు, హెచ్చుతగ్గులు ఉండే తీరాలనీ, అప్పుడే మనం జగత్తులో జీవించటానికి వీలవుతుందనీ గుర్తించాడు. రాజుగారి మాటలు విని రాణికూడా అరణ్యానికి వెళ్ళి నిర్మలమైన మనస్సుతో, నిశ్చలమైన భావంతో తపస్సు చేసింది. నారాయణుడు ప్రత్యక్షమై "అమ్మా! నీకేమి కావాలి?" అని అడిగాడు. "స్వామీ! మీరు నా పతిదేవునికి ఇచ్చిన వరమేమిటి?" అని ప్రశ్నించింది. "తన రాజ్యంలో ప్రజలందరూ నిండుగా నూరేళ్ళు జీవించి, తనవలె సుఖాలను అనుభవించాలని కోరుకున్నాడు. దానికి నేను అంగీకరించాను" అన్నాడు నారాయణుడు. అప్పుడు రాణి "స్వామీ! మంచివాడైన రాజు లేకుండా ప్రజలు నూరేళ్ళు జీవించి ప్రయోజనమేమిటి? కాబట్టి రాజుకూడా నూరేళ్ళు జీవించేటట్లు వరమును ప్రసాదించండి" అని కోరింది.

నారాయణుడు ఆమె విశాలహృదయానికి మెచ్చుకుని "అమ్మా! రాజు, ప్రజలే కాక నీవుకూడా నూరు సంవత్సరాలు జీవిస్తావు" అని వరమిచ్చాడు. రాణి తిరిగి వచ్చి జరిగిన సంగతి రాజుగారికి చెప్పింది. కాని రాజుగారు మొట్టమొదట కోరిన కోరికవల్ల ఉత్పన్నమైన సమస్య అలాగే మిగిలిపోయింది. ఎవ్వరూ తమ విధులకు హాజరు కావటం లేదు. రాజుగారు మళ్ళీ అరణ్యానికి వెళ్ళి తపస్సు చేసి నారాయణుణ్ణి ప్రసన్నుని గావించుకుని "స్వామీ! నేను మాట వినకపోవడం చాలా పొరపాటైంది. మీరు చెప్పినట్లు సృష్టిలో అందరూ సమానంగా ఉండటానికి వీలు కాదు. కాబట్టి, నా రాజ్యంలోని ప్రజలకు వారివారి సహజస్థితిని ప్రసాదించండి" అని కోరాడు. అప్పుడు నారాయణుడు "నాయనా! నేను మొదటే చెప్పాను. కాని, నీవు నా మాటను వినిపించుకోలేదు. భగవత్తత్వాన్ని అనుసరించినప్పుడే మానవునికి శాశ్వతమైన సుఖము కల్గుతుంది. భగవంతునితో చేరికయే నిజమైన సుఖము. ఇక నీవు నీ రాజ్యానికి తిరిగి వెళ్ళు. నీ ప్రజలకు వారి పూర్వస్థితిని ప్రసాదిస్తున్నాను" అన్నాడు. రాజుగారు తన రాజ్యంలో ప్రవేశించేసరికి స్వప్నదృశ్యంవలె అంతా మారిపోయింది. కలలో కనిపించింది ఎంతకాలం ఉంటుంది? "కలలో చూసిన మేడలు, మిద్దెలు కన్నులు విప్పిన లేవు కదా!" రాజ్యమంతా

sri sathyasai vahini

పరిశుభ్రంగా ఉంది. ఎవరి పని వారు చేస్తున్నారు. భగవంతుని సంకల్పము పవిత్రమైనదనీ, భగవంతుడు ఏది చేసినా మానవుల మంచికేనని అప్పుడు రాజుగారికి అర్థమైంది.

భగవంతుడు కష్టమునిచ్చినా, సుఖమునిచ్చినా మన మంచికోసమేనని గుర్తించాలి. భగవంతుణ్ణి కష్టంలో చింతించటం, సుఖంలో విస్మరించటం మానవత్వం కాదు. కష్టసుఖాలను సమత్వంతో స్వీకరించాలి. ఎలాంటి కష్టం కల్గినా భగవంతునిపై ప్రేమ, విశ్వాసములు కించిత్తైనా సడలకూడదు.

**లోకశాంతి ప్రార్థనతో రాదు, ప్రవర్తనతోనే వస్తుంది**

విద్యార్థులారా! సమావేశమైన ప్రతినిధులారా! మీరు విన్న విషయాలలో కనీసం ఒక్కటి రెండైనా ఆచరించి మీరు ఆనందాన్ని పొందండి, లోకానికీ ఆనందాన్ని అందించండి. అప్పుడే "లోకాస్సమస్తాః సుఖినో భవంతు" అని మీరు చేసే ప్రార్థన సార్థకమౌతుంది. సత్యసాయి సంస్థలు లోకాన్ని ఉద్ధరించటానికి ఏర్పడినవి. మీరంతా ఉద్ధారకులే! కనుక, లోకక్షేమంకోసం పాటుపడండి. ఇక్కడ మీరు విన్న విషయాలను కేవలం మాటలకు మాత్రమే పరిమితం చేయకుండా ఆచరణలో పెట్టండి. ఇక్కడ కాన్ఫరెన్సు జరిగింది. మీరు అనేక విషయాలను విన్నారు, పేపర్లలో వ్రాసుకున్నారు. అయితే కేవలం వినటాన్ని, వ్రాసుకోవటాన్ని నేను నమ్మను. ఆచరణలో పెట్టి అనుభవించండి బంగారూ! Work is Worship. లోకశాంతి మీ ప్రార్థనలతో రాదు, వ్రతాలతో రాదు, మీ ప్రవర్తనతోనే వస్తుంది. కాబట్టి, మొట్టమొదట మీరు చేసి చూపించండి. అదే నిజమైన భక్తి, నిజమైన సేవ. ప్రాచీనకాలంలో ఉండినట్లుగా భారతదేశాన్ని మీరు భగవన్మయం గావించాలి. అప్పుడే మీరు ధన్యులౌతారు.

**(24.11.2000 ఉదయం శ్రీ సత్యసాయి సేవా సంస్థల 7 వ ప్రపంచ సమ్మేళనం ముగింపు సందర్భంగా సాయి కుల్వంత్ సభామండపంలో శ్రీవారు అనుగ్రహించిన దివ్య సందేశము)**

sri sathyasai vachanamrutam